క్లుప్తంగా

సీడీసీ చైర్మన్‌కు మంత్రి పరామర్శ



నివాళులు అర్పిస్తున్న మంత్రి హరీశ్‌రావు, నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో గురువారం రాష్ట్ర ఆర్థికమంత్రి హరీశ్‌రావు మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. మంత్రితో పాటు జిల్లా పరిషత్తు చైర్పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్ రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ కలిసి మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓంప్రకాష్ పాటిల్, నాయకులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీకి ఎమ్మెల్యే పరామర్శ



రమేశ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): అందోలు జెడ్పీటీసీ ఖాదిరాబాద్ రమేశ్ మాతృమూర్తి మూడు రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలిసిందే.. దీంతో ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అక్సాన్‌పల్లి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నారాయణ, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు లింగాగౌడ్, ఎంపీపీ అధ్యక్షుడు బాలయ్య, బీఆర్‌ఎస్ నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్, రాజు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ..

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లిలో గుల్బర్గా ప్రాంతానికి చెందిన డాక్టర్ సురేష్‌చౌదరి బుధవారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ గురువారం మృతుడి నివాసానికి వెళ్లి మృతదేహానికి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి శివాజీరావు, ఏయంసీ డైరెక్టర్ మధు, రైతుబంధు అధ్యక్షుడు అశోక్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

చెత్త వేస్తే చర్యలు

నారాయణఖేడ్: రోడ్డుపై చెత్త వేస్తే వేసినవారే ఎత్తివేయాల్సి ఉంటుందని ఖేడ్ మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ హెచ్చరించారు. ఖేడ్ పట్టణంలోని బసవేశ్వరచౌక్ సమీపంలో ఓ హోటల్ యజమాని గురువారం హోటల్ ఎదుట రోడ్డుపై చెత్తను పారబోశారు. విషయం తెలుసుకుని అక్కడకు వెళ్లిన శ్రీనివాస్ చెత్తవేసిన యజమానిచేత చెత్తను ఎత్తివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిసారి రోడ్డుపై చెత్త వేసినవారి చేతే ఎత్తివేయిస్తామన్నారు. రెండోసారి వేస్తే ఎత్తివేయించడంతో పాటు జరిమానా విధిస్తామన్నారు.

ఈద్గా నిర్మాణ పనులు నిలిపివేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని సోలక్‌పల్లిలో ఆనంత పద్మనాభస్వామి దేవాలయానికి చెందిన భూమిలో ఆక్రమంగా ఈద్గా నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారని, ఆ పనులను నిలిపివేయాలని వార్డుసభ్యుడు జగన్‌రెడ్డి, నాయకుడు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం ఈ విషయమై తహశీల్దార్ దశరథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ముస్లింలకు కేటాయించిన పీర్లగుట్ట వద్ద ఈద్గా నిర్మించుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు. కార్యక్రమంలో దోమడుగు రమేష్, వుదూరు సుకాకర్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉపేందర్

జోగిపేట(అందోల్): జోగిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో మున్సిపల్ కమిషనర్ తిరుపతితో కలిసి సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు.కార్యక్రమంలో కౌన్సిలర్ దుర్గేష్, ఆర్టీసీ కంట్రోలర్ గంగారాం, ఆర్టీసీ ఉద్యోగులు ప్రసాద్, శివశంకర్, శ్రీనివాస్‌గౌడ్, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరు: మురుగునీటి కాలువల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని పాత మార్కెట్ సమీపంలో రూ.12లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రూ.5కోట్లతో వివిధ కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. అభివృద్ధికి ప్రతిఒక్కరూ స హకరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు అఫ్జల్ పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు) నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీలోని సందుగూడెం తండాలో ఎమ్మెల్యే సొంత నిధులతో చేపట్టిన చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుతో పాటు ఈద్గా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట తప్పకుండా దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మాల్లారెడ్డి, కౌన్సిలర్లు లచ్చిరాంనాయక్, బాలజీ, నాగరాజు, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, తెల్లాపూర్ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సాగర్, సత్యానారాయణ పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు



ఇఫ్తార్ విందులో నీలం మధు, నాయకులు

పటాన్‌చెరు టౌన్: మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం పట్టణంలోని శిశు మందిర్ కాలనీ అకుబా మసీదులో ముస్లింలతో కలిసి ఇఫ్తార్‌విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ముస్లీం మతపెద్దలు, ఎన్ఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సామాజిక సేవలో ప్రతిఒక్కరూ ముందుండాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. అనంతరం ఎన్ఎంఆర్ యువసేన నాయకులు సాయిముఖేష్, సాయికిరణ్, సాయికృష్ణ ఆధ్వర్యంలో ఎన్ఎంఆర్ యువసేనలో చేరారు. కార్యక్రమంలో నాయకులు ఖదీర్, అనంతరావు, సుధాకర్, కిషోర్, కార్తీక్ పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళం అందజేత



నారాయణ ఖేడ్: మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

నారాయణఖేడ్: మండల పరిధిలోని కొండాపూర్ హన్మాన్ ఆలయం ఆవరణలో రామాలయ నిర్మాణానికి విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేయిర్ ట్రస్టు తరఫున ట్రస్టు చైర్మన్, కేంద్ర ఆహార సంస్థ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ రూ.1,25,100 విరాళం ప్రకటించారు. గురువారం ఆలయంలో నిర్వహించిన హనుమాన్ జయంతిలో పాల్గొని విరాళానికి సంబంధించిన నగదును ఆలయ పీఠాధిపతి, అఖిలభారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కృష్ణమూర్తి, వెంకాగౌడ్, అంజాగౌడ్, ప్రశాంత్, విఠల్‌గౌండ, ప్రవీణ్‌కుమార్, అంజన్న, నరేష్‌గౌడ్, చింటు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని గడ్డపోతారం సర్పంచ్ పులిగిల్ల ప్రకాశ్‌చారి మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం తుజాల్పూర్ గ్రామంలో చేపడుతున్న నల్లపోచమ్మ ఆలయ నిర్మాణానికి గురువారం రూ.25వేల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో తుజాల్పూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

హత్నూర మండలంలో..

సంగారెడ్డి టౌన్: హత్నూర మండలంలోని దేవులపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి సంగారెడ్డి గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు నక్క నాగరాజుగౌడ్ రూ.51వేలతో పాటు 150 సిమెంట్ సంచులను విరాళంగా అందజేశారు. అనంతరం గ్రామ గౌడసంఘం పెద్దలు నాగరాజుగౌడ్‌ను సన్మానించారు.

తుల్జా భవానీమాత జాతర ప్రారంభం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: చారిత్రకమైన తుల్జా భవానీ మాత ఉత్సవాలు ఘనంగా గురువారం ప్రారంభమైయ్యాయి. మొగుడంపల్లి మండలంలోని భవానమ్మపల్లిలో ఛత్రపతి శివాజీ మహారాజ్, తుల్జాభవానీమాత మందిరాన్ని నిర్మించారు. ప్రతి ఏడాది జాతరను నిర్వహిస్తుంటారు. మూడు రోజుల పాటు నిర్వహించే జాతరకు తెలంగాణ రాష్ట్రంతో పాటు కర్నాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వస్తుంటారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి బోనాల ఊరేగింపు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారి ఊరేగింపు, తీర్థప్రసాదాల వితరణ ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

వట్‌పల్లి(అందోల్): సీపీఆర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎంపీపీ పత్రి క్రిష్ణవేణి అన్నారు. గురువారం వట్‌పల్లి రైతువేదిక భవనంలో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఆశాలు, ఏఎన్ఎంలు, ప్రజాప్రతినిధులకు సీపీఆర్‌పై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన జీవితంతో గుండెపోట్లు పెరిగాయని, సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండి ఎదుటివారి విలువైన ప్రాణాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో తాలెల్మ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ ఏర్పాటు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో ఎన్ఎంఆర్ యువసేన సభ్యులతో కలిసి గురువారం బీఆర్‌ఎస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొల్లారంలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులకు గురవుతున్నారన్న విషయం తెలుసుకుని వాటర్ ట్యాంకర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎన్ఆర్ యువసేన సభ్యులు గంటి శంకర్, లోకేష్‌బాబు, ధర్మారావు, బాలరాజు, రాజు, రాకేశ్ పాల్గొన్నారు.

కృష్ణకు దళితరత్నం అవార్డు



అవార్డు అందుకుంటున్న కృష్ణ

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని నస్తీపూర్ గ్రామానికి చెందిన ఓరిగంతం కృష్ణకు ప్రభుత్వం బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా దళితరత్నం అవార్డును మహనీయుల ఉత్సవాల కమిటీ చైర్పర్సన్ మేడి పాపన్న, రాజలింగం చేతులమీదుగా గురువారం రవీంద్రభారతిలో అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం నన్ను నా సేవలను గుర్తించి ఈ అవార్డు అందజేసినందుకు సంతోషంగా ఉందన్నారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

రుణాలు మాఫీ చేయాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పథ్వీరాజ్ అన్నారు. మండల పరిధిలోని తంగడపల్లిలో గురువారం రైతులతో కలిసి మాట్లాడారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంటలు నష్టపోయి కష్టకాలంలో ఉన్న రైతులను రుణాలు చెల్లించాలని బ్యాంకర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సమాఖ్య సంఘం సభ్యులు రవీందర్, శ్రీశైలం, భాస్వరాజ్, రాజు పాల్గొన్నారు.

సందేశ్ బైక్‌యాత్ర కరపత్రం విడుదల

జహీరాబాద్ టౌన్: ఈ నెల 10 నుంచి నియోజకవర్గంలో చేపట్టనున్న పూలే, అంబేద్కర్ సందేశ్ బైక్‌యాత్ర కరపత్రాన్ని కేవీపీఎస్ నాయకులు గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేత మాణిక్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రాజ్యాంగంలోని సూత్రాలను తొలగిస్తుందని వాపోయారు. భారత రాజ్యాంగం, రిజర్వేషన్లు కాపాడుకోవల్సిన బాధ్యతను వివరిస్తూ ఊరూరా సైకిల్‌యాత్ర చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్, కేవీపీఎస్ నాయకులు మహేష్, నరేష్, ప్రభాకర్, రాజు, శ్రీనివాస్, వెంకట్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

జిల్లా వ్యాప్తంగా హనుమాన్ జయంతిని నియోజకవర్గాల్లోని వివిధ మండలాలతో పాటు ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, యువత శోభయాత్రతో బైక్‌ర్యాలీలు నిర్వహించారు. హనుమాన్ నామస్మరణతో పరిసర ప్రాంతాలు మారుమోగాయి. ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.



జహీరాబాద్ టౌన్: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



సంగారెడ్డి టౌన్ : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు



జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారంలో..



ఝరాసంగం(జహీరాబాద్): ఝరాసంగంలో..



సదాశివపేట పట్టణంలో..

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



సంగారెడ్డి: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



పటాన్‌చెరు టౌన్‌లో..

నారాయణఖేడ్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం నారాయణఖేడ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రాంతీయ ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయిరాం, రాజుగౌడ్, ప్రవీణ్, సాయేందర్ పాల్గొన్నారు.

పటాన్‌చెరు టౌన్: బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. గురువారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ చౌరస్తాలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవేందర్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు సాయికుమార్, మండల ప్రధాన కార్యదర్శి కావలి వీరేశం, సుధాకర్‌రెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు పుణ్యవతి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ధన్‌రాజ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ రాజుగోపాల్‌యాదవ్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి దీపక్‌గౌడ్, ఎస్ఆర్‌కె యువసేన నాయకులు దస్తగిరి, శ్రీను, సంఘమేష్, అజయ్, వీరేశం పాల్గొన్నారు.

సంగారెడ్డి మున్సిపాలిటీ: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చౌటకూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆందోల్ నియోజకవర్గం కన్వీనర్ ఉదయ్ బాబూమోహన్, పార్టీ మండల అధ్యక్షులు శేఖర్ గౌడ్, మండల నాయకులు ప్రవీణ్, రామకృష్ణ, ఉపేందర్ రెడ్డి, సాగర్, అరుణ్ మల్లేశం పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష



మాట్లాడుతున్న జగన్నాథ్

జహీరాబాద్ టౌన్: పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు గురువారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథ్, జిల్లా అధికార ప్రతినిధి సుధీర్ కుమార్, నాయకులు రామచందర్ రాజ నరసింహ, శ్రీనివాస్గౌడ్, సుధీర్ బండారి, మల్లికార్జున పాటిల్, కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: బీఆర్‌ఎస్ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ప్రభుత్వం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ను అరెస్టు చేయించిందని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు విజయపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు. అవసరమైన సమయంలో బీఆర్‌ఎస్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కో–కన్వీనర్ మారుతిరెడ్డి, నాగల్‌గిద్ద పార్టీ మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీటీ రణదివే త్యాగాలు మరువలేనివి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



మాట్లాడుతున్న మల్లికార్జున్

పటాన్‌చెరు టౌన్: సమసమాజ స్థాపనకు పోరాటం చేసిన బీటీ రణదీవే త్యాగాలు మరువలేనివని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్ అన్నారు. గురువారం పట్టణంలోని శ్రామికభవన్‌లో సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులు బీటీ రణదివే 33 వర్థంతిని సీఐటీయూ పటాన్‌చెరు ఏరియా కమిటీ, వివోఏల యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ బీటీ రణదేవే భారతదేశంలో కార్మిక వర్గ సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. సామాజిక ఉద్యమాలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఈనెల 10, 11, 12 తేదీల్లో సామాజిక ఉద్యమనిధి కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. 13న 10కే రన్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనంతరావు, బంగారాజు, శ్రీనివాస్, వివోఏ యూనియన్ నాయకురాలు సంతోష, సరిత, మంజుల పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ముగిసిన సప్తఅఖండ నామస్మరణ**

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటపూర్‌లోని హనుమాన్ ఆలయంలో చేపట్టిన సప్తఅఖండ నామస్మరణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఏడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్, గ్రామపెద్దలు సంగన్న, పోచన్న, నరేష్ గౌడ్, శంకర్, విజయ్‌కుమార్, మల్లారెడ్డి, వెంకటేశం, సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి కృషి

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ సంజీవమ్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని ప్యారవరంలో రూ.20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, మురుగుకాలువల నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజ్కుమార్, ఉపసర్పంచ్ మాణిక్యాదవ్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం.. సీఎంఆర్‌ఎఫ్

కొండాపూర్(సంగారెడ్డి): నిరుపేదలకు వరం.. సీఎంఆర్‌ఎఫ్ అని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. గురువారం సదాశివపేటలోని తన క్యాంపు కార్యాలయంలో మండల పరిధిలోని మల్లెపల్లికి చెందిన గోపాల్‌కు చికిత్స నిమిత్తం రూ.2,50లక్షల ఎల్‌ఓసీని కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షులు విఠల్, మాజీ కార్యదర్శి నరసింహరెడ్డి, ఎంపీటీసీ రాందాస్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు సరికావు

నారాయణఖేడ్: ఖేడ్‌లోని గురుకులంలో చదువుతున్న విద్యార్థినుల తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేసేవిధంగా కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యానించడం సరికాదని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, కౌన్సిలర్ కవిత విఠల్, కోఆప్షన్ సభ్యులు లయక్, జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షులు నగేష్, మైనార్టీ విభాగం అధ్యక్షులు గౌస్‌చిస్తీ తదితరులు గురుకులం విద్యార్థిని తల్లిదండ్రులతో కలిసి గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఓ విద్యార్థిని తన గ్రామానికి చెందిన బాలుడి చేతిలో మోసపోయి గర్భం దాల్చి ప్రసవించగా గురుకులం ప్రిన్సిపాల్ మానవత్వంతో విద్యార్థినితో పాటు పసికందును కుటుంబీకులకు అప్పగిస్తే కుటుంబీకులే శిశువును పొదల్లో వేశారన్నారు. గురుకులంలోనే అత్యాచారం జరిగిందంటూ అసత్యపు ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యేలా కాంగ్రెస్ నాయకులు ప్రకటనలు చేయడం సరికాదన్నారు.

బీసీ గురుకులానికి స్థలం కేటాయింపు

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలంలోని బాచేపల్లి శివారులోని సర్వేనెంబరు 178లో 5ఎకరాల ప్రభుత్వ భూమిని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల, వసతిగృహ నిర్మాణానికి స్థలం కేటాయించారు. గురువారం నిజాంపేట్ తహశీల్దార్ మదన్, గిర్దావర్ బిన్ ముషాఫా, శ్యాంరావు పటేల్ స్థలాన్ని సర్వే చేయించి హద్దులు నిర్దేశించారు. అనంతరం గురుకులం ప్రిన్సిపాల్‌కు స్థలం వివరాలతో కూడిన కేటాయింపు ఉత్తర్వును అందజేశారు. బాచేపల్లి పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, నిజాంపేట్ సర్పంచ్ జగదీశ్వరాచారి పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

పటాన్‌చెరు టౌన్: అనారోగ్యంతో ముత్తంగి గ్రామ మాజీ సర్పంచ్ హరిపంతులు భాస్కర్‌రావు మృతి చెందారు. కొన్ని రోజులుగా క్యాన్సర్‌తో బాధపడుతున్న భాస్కర్‌రావు 15 రోజుల క్రితమే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసి ఇంటికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఆయన ఆరోగ్యం మరింత విషమించడంతో గురువారం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. భాస్కర్‌రావు 1988 నుంచి 1996 వరకు ముత్తంగి సర్పంచ్‌గా సేవలు అందించారు. శుక్రవారం భాస్కర్‌రావు అంత్యక్రియలు ముత్తంగిలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నీటి సరఫరాలో అంతరాయం

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణ శివారులోని పంపింగ్ సంపు వద్ద విద్యుత్తు అంతరాయం కారణంగా ఖేడ్ పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రి ఆవరణ, పటేల్‌కాలనీ, ఎడ్లబజార్, భవానీకాలనీ, అనుశమ్మకాలనీ, పెద్దమజీదు, నగరేశంమందిరం, రామాలయం, శాస్త్రినగర్‌కాలనీ, బ్రాహ్మణగల్లిల్లో ఉన్న నీటి ట్యాంకులకు నీటి సరఫరా నిలిపివేసినట్లు మున్సిపల్ నీటిసరఫరా ఇన్‌చార్జి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం తాగునీటి సరఫరా జరగకపోగా శుక్రవారం సైతం నీటిసరఫరా నిలిపివేయనున్నట్లు, ఆయా కాలనీలవాసులు సహకరించాలని కోరారు.

వైభవంగా భవానీమాత బోనాలు

రాయికోడ్(అందోల్): మండలంలోని కర్చల్ గ్రామంలో గురువారం భవానీమాత బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతురాజుల నృత్యాలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి బోనాలను సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అక్కమహాదేవి జయంతి

జహీరాబాద్ టౌన్: వీరవిరాగిణి, కన్నడ భాష సాహిత్యాకాశంలో దేదిప్యమానంగా వెలుగొందిన అక్కమహాదేవి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. అక్కనబళగ, లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో నాగులకట్ట పట్టణంలోని అనుభవ మండపంలో నామకరణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కమహాదేవి భావచిత్ర శోభయాత్ర చేపట్టారు. అదేవిధంగా పట్టణంలోని దత్తగిరి బసవ మంటపంతో పాటు కోత్తూర్(బి) గ్రామంలోని అనుభవ మంటపంలో వేడులను నిర్వహించగా సర్పంచ్ జగన్‌మోహన్,పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం



హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని పన్యాల గ్రామంలో గురువారం కంటివెలుగు శిబిరాన్ని ఎంపీపీ వావిలాల నర్సింలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదప్రజలు కంటి సమస్యతో ఇబ్బంది పడొద్దన్న ఉద్దేశంతోనే ప్రతిగ్రామంలో కంటివెలుగు శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వాతిబుచ్చిరెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల యువత అధ్యక్షుడు తుమ్మలపల్లి కిషోర్, ఉపసర్పంచ్ యాదగిరి పాల్గొన్నారు.